క్లుప్తంగా

'బీసీ రిజర్వేషన్ల జీఓను కొట్టివేయడానికి వీలులేదు'

కాచిగూడ: తెలంగాణలో బీసీ సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై సమగ్ర కుటుంబ సర్వే, డెడికేషన్‌ కమిషన్‌ నివేదిక తర్వాతే ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీఓ నం.9ని జారీ చేసిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్‌ గుజ్జ కృష్ణ తెలిపారు. దీనికి పూర్తి చట్టబద్ధత ఉండటంతో బీసీ రిజర్వేషన్ల జీఓను హైకోర్టు కొట్టివేయడానికి వీలులేదన్నారు. బుధవారం లాయర్స్‌ ఫోరం ఫర్‌ సోషల్‌ జస్టిస్‌ ప్రధానకార్యదర్శి సామల రవీందర్‌, మాజీ జీపీ రాంప్రసాద్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. రాజ్యాంగంలో ఎక్కడ కూడా 50 శాతం పరిమితి లేదని కాబట్టి ప్రభుత్వానికి ఎలాంటి అడ్డంకి ఉండదని గుజ్జ కృష్ణ పేర్కొన్నారు. పంచాయతీరాజ్‌ ఎన్నికలు యథావిధిగా కొనసాగనున్నాయని తెలిపారు. ఈ ఎన్నికల నిలుపుదలకు కొందరు జీఓ నం.9పై స్టే విధించాలని కోర్టును ఆశ్రయించినందున కోర్టు దానిని తోసిపుచ్చిందన్నారు.

12న దసరా మిలాప్‌



సమావేశంలో పాల్గొన్న సభ్యులు

ముషీరాబాద్‌: తెలంగాణ దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన దసరా మిలాప్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మిలాప్‌ కన్వీనర్‌ ఆర్‌.వివేకానంద్‌ తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎస్‌ఆర్‌టీ కమ్యూనిటీహాల్‌లో దసరా మిలాప్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ముషీరాబాద్‌ నియోజకవర్గంలోని అన్ని దళిత సంఘాలు, దళిత నాయకులు, మహిళా ప్రతినిధులు, దళిత యువకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మీడియా కన్వీనర్‌ గజ్జెల సత్యనారాయణ, శ్యామ్‌సుందర్‌(చిట్టి), అరుణ, గండి కృష్ణ, గడ్డం నవీన్‌, వెంకటేష్‌, బాస్కర్‌, రామస్వామి, గిరి, పరమల్‌కుమార్‌, సదానంద్‌ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యల పరిష్కారంలో విఫలం

కాచిగూడ: దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న మత్స్యకారులు సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం పూర్తిగా విఫలమవుతోందని బీజేపీ మత్స్యకార విభాగం రాష్ట్ర కో–కన్వీనర్‌ రమణ ముదిరాజ్‌ అన్నారు. బుధవారం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి ఏటా మత్స్యశాఖకు ప్రభుత్వం రూ.100కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నా మత్స్యకారులకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరడం లేదన్నారు. మత్స్యకారులకు బదులుగా కాంట్రాక్టర్లు, మధ్యవర్తులు అధిక లాభాలను అర్జిస్తున్నారని ఆరోపించారు.

సీఏఎస్‌ ప్రమోషన్స్‌లో అధ్యాపకులకు అన్యాయం

లాలాపేట: ఇటీవల నిర్వహించిన కెరీర్‌ అడ్వాన్స్‌మెంట్‌ స్కీం(సీఏఎస్‌) ఇంటర్వ్యూల్లో ఓయూలో 48 మంది అధ్యాపకులకు ప్రమోషన్స్‌ లభించక తీరని అన్యాయం జరిగిందని ఔటా అధ్యక్షులు ప్రొఫెసర్‌ మనోహర్‌ ఆరోపించారు. బుధవారం సీఏఎస్‌ ప్రమోషన్స్‌లో జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఆర్ట్స్‌ కళాశాల ఎదుట పలువురు అధ్యాపకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓయూ అధికారులు సీఏఎస్‌ ఇంటర్వ్యూలు సరిగ్గా చేయలేదని పేర్కొన్నారు. గడచిన 50 ఏళ్లలో ఇప్పటి వరకు సీఏఎస్‌ ఇంటర్వ్యూల్లో అధ్యాపకులను రిజెక్ట్‌ చేసిన దాఖలా లేదన్నారు. ఏకగా 48 మంది అధ్యాపకులకు ప్రమోషన్స్‌ ఇవ్వకుండా చేయడం దారుణం అన్నారు. ఉత్తమ అధ్యాపకులకు, ఉత్తమ పరిశోధకులకు సైతం అన్యాయం జరిగిందని వివరించారు. కానీ ఎలాంటి పనితీరు లేని కొంత మంది అధ్యాపకులకు ప్రమోషన్స్‌ ఇచ్చిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, యూనివర్సిటీ అధికారులు స్పందించి అర్హత కల్గిన ప్రతి అధ్యాపకుడికి ప్రమోషన్‌ ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్‌ చేశారు.



శంకరమఠం మెయిన్‌ రోడ్డులోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదురుగా ఇలా..

ప్రజారోగ్యమే ధ్యేయమంటూ గొప్పలు చెబుతున్న ప్రభుత్వం ఆచరణలో మాత్రం విఫలమైంది. సంపూర్ణ పారిశుద్ధ్యం కలగానే మిగిలింది. బస్తీలు, కాలనీలు, మురికి వాడలు తేడాలేకుండా ఎక్కడికక్కడే చెత్త పేరుకుపోతోంది. నెలల తరబడి డ్రైనేజీ మ్యాన్‌ హోళ్లలో వ్యర్థాలను తొలగించకపోవడంతో మురుగు రోడ్లపైకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో దోమలు విజృంభించి వ్యాధులను వ్యాప్తి చేస్తున్నాయి.

పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

వీధుల్లో పేరుకుపోతున్న వ్యర్థాల కుప్పలు

- వృద్ధి చెందుతున్న దోమలు
- విషజ్వరాల బారిన పడుతున్న ప్రజలు
- రోడ్లపై పారుతున్న మురుగు

నల్లకుంట: ఇటీవల కురుస్తున్న వర్షాలతో నగరం తడిసి ముద్దయ్యింది. రహదారులు సహా పలు ప్రాంతాలు జలమయమయ్యాయి.

- మూసీ పరీవాహక బస్తీలలో రోజుల తరబడి ఇళ్లు నీటిలో ఉండిపోయాయి. రోడ్లపై నీరు నిలిచి డ్రైనేజీలు పొంగిపొర్లుతున్నాయి. వర్షంతో పాటు వ్యాధులూ ముసురుతున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ వర్షాలతో ఇవి మరింత పెరిగే ప్రమాదముంది. మరో పక్క వాంతులు, విరేచనాలు, ఇంటినొప్పులు, జలుబువంటి వ్యాధులు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వీధుల్లో మురుగు నిలిచిపోయి దోమలు వృద్ధి చెందుతుండడంతో కొన్ని ప్రాంతాల్లో విషజ్వరాలు, డెంగీ చాపకింద నీరులా విస్తరిస్తోంది.

శంకరమఠం ప్రధాన రహదారిలో రోడ్డు పక్కనే మురుగు పరుగు..

నల్లకుంట శంకరమఠం మెయిన్‌ రోడ్డులోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌ ఎదురుగా రోడ్డుకు అవతలివైపున ఫుట్‌పాత్‌ పక్కన జీహెచ్‌ఎంసీ ఇటీవల చెత్త డబ్బాలను ఏర్పాటు చేసింది. డబ్బాల వద్ద మురుగు చేరడంతో పారిశుద్ధ్య సిబ్బంది ఆ చెత్త డబ్బాలను అక్కడి నుంచి తొలగించి రోడ్డుపైకి చేర్చారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీనికి తోడు ఆ పక్కనే రోడ్డు పక్కన వ్యర్థాలు పేరుకుపోయాయి.

- నిత్యం వ్యర్థాలను తరలించాల్సిన పారిశుద్ధ్య కాంట్రాక్టర్‌ పూర్తి స్థాయిలో చెత్తను తరలించకుండా కేవలం డబ్బాల్లోని చెత్తనే తరలిస్తున్నారని అన్నారు. రోడ్డు పక్కన పేరుకుపోతున్న వ్యర్థాలను తొలగించడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెత్త డబ్బాలను రోడ్డపై పెట్టడంతో పాదచారులకు నడిచేందుకు దారిలేక రోడ్డుపై నుంచి నడుస్తున్నారు. అక్కడ మురుగు నిల్వ ఉండకుండా మురుగు వెళ్లేందుకు వీలుగా మ్యాన్‌ హోల్‌ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

తిలక్‌నగర్‌ చౌరస్తాలో మురుగు పరుగు..

తిలక్‌నగ్‌ చౌరస్తా వద్ద ఉన్న మున్నా హీరో హోండా షో రూం వద్ద రోడ్డు పక్కన డ్రైనేజీ మ్యాన్‌ హోల్‌ వ్యర్థాలతో నిండిపోయి నిత్యం మురుగు పొంగిపొర్లుతోంది. దుర్వాసన రావడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జలమండలి అధికారులు స్పందించి మురుగు సమస్యకు శాశ్వత పరిష్కార చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గోల్నాక కంపౌండ్‌ వద్ద దుర్గంధం..

గోల్నాక మార్కెట్‌ రోడ్డులోని కల్లు కంపౌండ్‌ ప్రహరీ వద్ద జీహెచ్‌ఎంసీ చెత్త డబ్బాలు ఏర్పాటు చేసింది. ఇళ్లల్లో పేరుకుపోయిన చెత్తను తీసుకొస్తున్న స్థానికులు ఆ చెత్తను నేరుగా డబ్బాల్లో వేయకుండా రోడ్డుపక్కనే పడేసి వెళ్తున్నారు. దీంతో చెత్తను తరలించే సిబ్బంది కేవలం డబ్బాల్లోని చెత్తను మాత్రమే తరలించి రోడ్డు పక్కన పడవేస్తున్న చెత్తను అలాగే వదిలేస్తున్నారని స్థానికులు అంటున్నారు. దీనికి తోడు కల్లు కాంపౌండ్‌ల మద్యం సేవించేందుకు వచ్చే కొందరు మద్య మత్తులు ఆ చెత్త కుప్పలు, డబ్బాల పక్కనే మూత్ర విసర్జన చేస్తున్నారని. దీంతో తీవ్రమైన దుర్వాసన వెలువడుతుండడంతో భరించలేకపోతున్నామని సమీపంలోని ఇళ్ల వాసులు అంటున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించి రోడ్ల పక్కన చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే బహిరంగ ప్రదేశాలలో మూత్ర విసర్జన చేసే వారిపై కూడా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



గోల్నాక కల్లు కాంపౌండ్‌ ప్రహరీ వద్ద చెత్త డబ్బాల పక్కనే వ్యర్థాలు



కల్లు కాంపౌండ్‌ ఎదురు రోడ్డులో ఇలా..

బీసీ రిజర్వేషన్లకు అందరూ సహకరించాలి

జాతీయ బీసీ దళ్‌ అధ్యక్షుడు కుమారస్వామి

కాచిగూడ: బీసీ రిజర్వేషన్ల అమలుకు అందరూ సహకరించాలని హైకోర్టులో విచారణ అనంతరం జాతీయ బీసీ దళ్‌ అధ్యక్షుడు కుమారస్వామి వెల్లడించారు. బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా హైకోర్టులో అగ్రవర్ణాలకు చెందిన కొందరు పిటిషన్‌ వేశారన్నారు. హైకోర్టు జీవో నం.9ను నిలుపుదల చేస్తూ ఎలాంటి తాత్కాలిక నిర్ణయం తీసుకోకపోవడం శుభపరిణామమని అన్నారు. హైకోర్టు న్యాయం పక్షాన నిలబడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రిజర్వేషన్‌ వ్యతిరేకులది అధర్మ పోరాటమని విమర్శించారు. వారు చేసే వాదనలలో ఏమాత్రం న్యాయం లేదని అన్నారు. అన్యాయంగా బీసీలకు రావాల్సిన వాటాను అడ్డుకోవాలని చూడటం చాలా దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. వ్యతిరేకులు భావించినట్లుగా హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియకు స్టే ఇవ్వకపోవడం గొప్ప నిర్ణయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జాగృతి అధ్యక్షుడు కేపీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కచ్చానాలాకు మరమ్మతులు



పనులను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

ముషీరాబాద్‌: భోలక్‌పూర్‌ డివిజన్‌ పీఅండ్‌టీ కాలనీలో కచ్చా నాలా పై కప్పు పునర్‌నిర్మాణ పనులను బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజన్‌ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, జీహెచ్‌ఎంసీ డీఈ సన్నీ, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ దాసులు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌ బీఆర్‌ఎస్‌ ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్‌, ప్రవీణ్‌ తదితరులు పాల్గొన్నారు.

కులాంతర వివాహ రక్షణ చట్టం చేయాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆదర్శ వివాహంలో మాట్లాడుతున్న వినయ కుమార్‌

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కులాంతర వివాహాలను ప్రోత్సహించడానికి వారికి రక్షణ చట్టం చేయాలని ఎస్‌వీకే కార్యదర్శి ఎస్‌.వినయకుమార్‌ డిమాండ్‌ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్‌ ఆధ్వర్యంలో వెన్నెల, హరీష్‌ల ఆదర్శ వివాహం జరిగింది. ఈ సందర్భంగా పూల దండలు మార్పించి ప్రమాణ పత్రాలు చదివించి వివాహం జరిపించారు. అనంతరం వినయకుమార్‌ మాట్లాడుతూ... కులాంతర మతాంతర వివాహాలను ప్రోత్సహించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్‌ ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్‌బాబు, కోటార మేష్‌, పాలడగు భాస్కర్‌, శ్రీరాం నాయక్‌, ఎస్‌. రజనికాంత్‌, టి. నాగరాజు, ఎం. శోభన్‌ నాయక్‌, మహేందర్‌ తదితరుల పాల్గొన్నారు.

రఘుపతి వెంకటరత్నం నాయుడు యాదిలో..



నివాళులర్పిస్తున్న కోలేటి దామోదర్‌గుప్తా, కళా జనార్దనామూర్తి

చిక్కడపల్లి: సమాజంలో మూఢనమ్మకాలను రూపుమాపేందుకు ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన గొప్ప సంఘ సంస్కర్త రఘుపతి వెంకటరత్నం నాయుడు అని పోలీస్‌ హౌసింగ్‌ కార్పొరేషన్‌ పూర్వ చైర్మన్‌ కోలేటి దామోదర్‌గుప్తా అన్నారు. బుధవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో రఘుపతి వెంకటరత్నం నాయుడు యాదిలో.. ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యాలయంలోకి ఆడపిల్లలకు ప్రవేశం కల్పించి సహ విద్యను ప్రోత్సహించడంతో బ్రిటీషు ప్రభుత్వం ఆయనకు నైట్‌ హూడ్‌ బిరుదును ప్రదానం చేసిందన్నారు. కుల, మత భేదాలకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు వీఏస్‌ కళా జనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు శైలజామిత్ర, టి.రామోజీ, జి.గీతాదేవి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్‌



వివేక్‌నగర్‌ దుర్గా నిలయం రోడ్డులో ఇలా..

చిక్కడపల్లి: గాంధీనగర్‌ డివిజన్‌ వివేక్‌నగర్‌ పీపుల్స్‌పార్క్‌ లేన్‌లో దుర్గా నిలయం రోడ్డులో కొంత కాలంగా మ్యాన్‌హోల్‌ లోపలికి దిగబడి ప్రమాదకరంగా మారిన పట్టించుకునే నాథుడే లేరు. ఈ సమస్యపై కాలనీ వాసులు అనేక సార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు గుండా వెళ్లే వాహనాదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం వాకింగ్‌కు వెళ్లే వారు, వాహనాదారులు మ్యాన్‌ హోల్‌ వల్ల తరచు ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత వాటర్‌వార్క్స్‌ సీవరేజీ బోర్డు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌సీసీ జాతీయ ట్రెక్కింగ్‌లో హైదరాబాద్‌ గ్రూప్‌ విజేత

లాలాపేట: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ డైరెక్టరేట్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్‌సీసీ జాతీయ ట్రెక్కింగ్‌ శిబిరంలో పాల్గొన్న హైదరాబాద్‌ గ్రూప్‌ అన్ని విభాగాల్లో ఓవరాల్‌ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా కమాండర్‌ కల్నల్‌ ప్రశాంత్‌కుమార్‌ మాట్లాడుతూ.. ఎన్‌సీసీ విద్యార్థులకు సామాజిక బాధ్యతతో పాటు సాహసం ఉండాలన్నారు. ఇటీవల గుంటూరు జిల్లా చౌడవరంలో నిర్వహించిన ఈ శిబిరంలో 510 మంది క్యాడెట్లకు శిక్షణ ఇచ్చారు. దీనికి లెఫ్టినెంట్‌ డాక్టర్‌ పల్నాటి నరేశ్‌, హిమబిందు అధికారుల పర్యవేక్షణలో హైదరాబాద్‌ గ్రూపు నుంచి 60 మంది క్యాడేట్లు పాల్గొన్నారు. కోటప్పకొండ, కొండవీడు, విజయవాడ కొండపల్లి ప్రాంతాల్లో ట్రెక్కింగ్‌ నిర్వహించారు. దీంతో పాటుగా టగ్‌ ఆఫ్‌ వార్‌, సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక అంశాలపై ప్రదర్శన, ఇతర అంశాల్లో పోటీలు నిర్వహించారు. వీటన్నింటిలో హైదరాబాద్‌ గ్రూప్‌ ఓవరాల్‌ విజేతగా నిలిచింది. విజేతలకు గుంటూరు గ్రూప్‌ కమాండర్‌ కల్నల్‌ సుహాన్ష్‌ దుబే, కల్నల్‌ ఉదయ్‌ కుమార్‌లు ట్రోఫీలను అందజేశారు. హైదరాబాద్‌ గ్రూప్‌ను విజేతగా నిలిపిన అధికారులను 3వ తెలంగాణ బెటాలియన్‌ కమాండింగ్‌ ఆఫీసర్‌ లెఫ్టినెంట్‌ కల్నల్‌ ప్రత్యేకంగా అభినందించారు.



వాహనదారులు నిబంధనలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న డీసీపీ ఆర్‌.వెంకటేశ్వర్లు, ఏసీపీ ధనలక్ష్మి

అబిడ్స్‌: వాహనారులు తప్పకుండా ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలని నగర ట్రాఫిక్‌ డీసీపీ ఆర్‌.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సౌత్‌వెస్ట్‌ జోన్‌ ఏసీపీ ధనలక్ష్మితో కలిసి కుల్సుంపురా, టప్పాచబుత్రా, గుడిమల్కాపూర్‌, సీతారాంబాగ్‌, ఆసిఫ్‌నగర్‌ తదితర ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. రాంగ్‌రూట్‌లో వెళ్తున్నవారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సందర్భంగా రాంగ్‌ రూట్‌లో వెళ్తున్న 16 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్‌, కుల్సుంపురా ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్లు కోటేశ్వర్‌రావు, రాజేంద్రప్రసాద్‌, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యుడి అరెస్టు

బంజారాహిల్స్‌: రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యుణ్ణి జూబ్లీహిల్స్‌ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. వెంకటగిరిలో నివసించే నీలి శశిధర్‌ (32) డాక్టర్‌గా చెలామణి అవుతూ రహమత్‌నగర్‌లో వెంకటేశ్వర ఫస్ట్‌ ఎయిడ్‌ క్లినిక్‌ను గత కొంతకాలంగా నిబంధనలు ఉల్లంఘించి నడుపుతున్నాడు. ఎంబీబీఎస్‌ చదివిన డాక్టర్‌ లాగా ప్రిస్కిప్షన్లు రాస్తూ రోగులకు వైద్యం చేస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఈ క్లినిక్‌పై దాడి చేసి నకిలీ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. రోగులను చీటింగ్‌ చేస్తున్నట్లు కూడా గుర్తించారు. అంతేకాకుండా సమీపంలో శ్రీనివాస్‌ అనే వ్యక్తితో మెడికల్‌ షాపు కూడా తెరిపించాడు. శశిధర్‌ రాసిన మందులను శ్రీనివాస్‌ విక్రయించేవాడు. ఇది కూడా నిబంధనలకు విరుద్ధమేనని పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో పోలీసులు నీలి శశిధర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. శ్రీనివాస్‌ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. క్లినిక్‌లో పెద్ద ఎత్తున మందులను, వైద్య సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

- 12 నుంచి పల్స్‌ పోలియో కార్యక్రమం
- ముషీరాబాద్‌ యూపీహెచ్‌సీలో వైద్యులతో అంబర్‌పేట క్లస్టర్‌ డా. పద్మజ
- ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి



ముషీరాబాద్‌ యూపీహెచ్‌సీ వైద్యుల సమావేశంలో మాట్లాడుతున్న అంబర్‌పేట క్లస్టర్‌ డాక్టర్‌ పద్మజ

ముషీరాబాద్‌: పోలియో రహిత సమాజ స్థాపన కోసం ప్రభుత్వం ఈనెల 12వ తేదీన పల్స్‌ పోలియో కార్యక్రమాన్ని చేపట్టింది. మొదటి రోజు ప్రధాన కేంద్రాలలో అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు పిల్లలకు పోలియో చుక్కల మందు తప్పనిసరిగా వేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ముషీరాబాద్‌ నియోజకవర్గంలోని యూపీహెచ్‌సీలతో పాటు ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు చుక్కల మందు వేసే కార్యక్రమం చేపట్టింది.

- ముషీరాబాద్‌ నియోజకవర్గంలోని యూపీహెచ్‌సీలలో పల్స్‌ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బుధవారం ముషీరాబాద్‌ యూపీహెచ్‌సీలో అంబర్‌పేట క్లస్టర్‌ డాక్టర్‌ పద్మజ స్థానిక వైద్యులతో పల్స్‌ పోలియో కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముషీరాబాద్‌, భోలక్‌పూర్‌, తిలక్‌నగర్‌, ఏఎంఎస్‌, బాగ్‌ అంబర్‌పేట, హర్రాస్‌పెంట వైద్యులచే సమావేశం నిర్వహించారు. తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.

183 కేంద్రాల్లో పల్స్‌ పోలియో...

అంబర్‌పేట క్లస్టర్‌ పరిధిలోని ఆయా ప్రభుత్వ ఆసుపత్రులకు సంబంధించి 183 కేంద్రాలలో పోలియో చుక్కల మందులు వేయనున్నారు. ముషీరాబాద్‌లో 15 కేంద్రాలు, భోలక్‌పూర్‌లలో 26 కేంద్రాలు, రంగానగర్‌లోని బైబిల్‌ హౌస్‌ యూపీహెచ్‌సీలో 20 కేంద్రాలు, ఏఎంఎస్‌లో 20 కేంద్రాలు, తిలక్‌నగర్‌ యూపీహెచ్‌పీలో 30 కేంద్రాలు, బాగ్‌ అంబర్‌పేటలో 35 కేంద్రాలు, హర్రాస్‌పెంటలో 29 కేంద్రాలలో పిల్లలకు చుక్కల మందులు వేయనున్నారు.

తప్పనిసరిగా వేయించాలి

ఐదేళ్ల లోపు పిల్లందరికీ తప్పనిసరి పల్స్‌ పోలియో చుక్కలు వేయించాలి. పిల్లలకు జ్వరం, విరోచనాలు, ఇతర సమస్యలు ఉన్నా చుక్కల మందు వేయించొచ్చు. ప్రధాన కూడళ్లు, స్థానికంగా ఉండే కమ్యూనిటీ హాల్స్‌ వద్ద పల్స్‌ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నాం. 13, 14వ తేదీల్లో ఇంటింటికీ వెళ్లి తమ సిబ్బంది పోలియో చుక్కల మందు వేస్తారు.

– అంబర్‌పేట క్లస్టర్‌ డా. పద్మజ

వీధుల్లో ప్రచారం..

చిన్నారులకు తప్పనిసరి చుక్కల మందు వేయించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. వీధులలో ప్రచార కార్యక్రమాలను మొదలుపెట్టాం. ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు వీధుల్లో తిరుగుతూ ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తిస్తున్నారు. వారందరికీ చుక్కల మందు వేయించేలా చర్యలు చేపట్టాం. ఆస్పత్రి పరిధిలో 2686 మంది చిన్నారులు ఉన్నారు.

– డా. మనోజ్‌రెడ్డి

భక్తిశ్రద్ధలతో లలితా సహస్రనామ పారాయణం

నల్లకుంట: పౌర్ణమిని పురస్కరించుకొని నల్లకుంట శంకరమఠంలో మంగళవారం శారదామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మఠం ప్రాంగణంలోని యాగశాలలో చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం పేరేపి విశాలాక్షి బృందం లలితా సహస్రనామ పారాయణం చేసింది. ఈ సందర్భంగా విశాలక్షిని మఠం నిర్వాహకులు సన్మానించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



లలితా సహస్రనామ పారాయణ చేస్తున్న పేరేపి విశాలక్షి బృందం



పేరేపి విశాలాక్షిని సన్మానించిన అమ్మవారి భక్తులు